కోలాహలంగా వినాయక నిమజ్జనం


కూడేరులో పశువుల ఆస్పత్రి వద్ద ప్రత్యేక పూజలందుకుంటున్న వినాయకుడు


ఉరవకొండలో ట్రాక్టర్‌పై నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయక విగ్రహం


ఉరవకొండలోని ఉప్పర వీధిలో వేలం పాటలో వినాయక లడ్డూను దక్కించుకున్న వారిని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

ఉరవకొండ: పట్టణంలో పలు వినాయకుల విగ్రహాలను నిమజ్జనం కోసం శనివారం నాల్గో రోజు భారీ ఊరేగింపు నడుమ తరలించారు. స్థానిక క్లాక్‌టవర్ నుంచి ప్రత్యేక వాహనాల్లో విగ్రహాలను కొలువు తీర్చి భక్తి శ్రద్ధలతో డ్రమ్స్ వాయిద్యాల మధ్య నిమజ్జనానికి తరలించారు. ఊరేగింపు మధ్య తరలించిన విగ్రహాలను నింబగల్లు వద్ద హెచ్చెల్సీ, ముష్టూరు వద్ద జీబీసీ కాలువల్లో నిమజ్జనం చేశారు. మరికొన్ని విగ్రహాలను పెన్నహోబిలం సమీపంలోని పెన్నానదిలో నిమజ్జనం చేశారు.

పోటాపోటీగా వినాయక లడ్డూ ప్రసాద వేలం

స్థానిక ఉప్పర వీధి వినాయక ఉత్సవ సమితి లడ్డూ వేలం పోటాపోటీగా శనివారం నిర్వహించారు. స్వామి వారి లడ్డూను హిందూపురం నియోజకవర్గానికి చెందిన ఉప్పర ఓజస్వి రూ.44,516 కు వేలంపాటలో దక్కించుకున్నారు. స్వామి వారి కండువా వైద్య శాఖలో పనిచేసే లోక్‌నాథ్ రూ.18,116కు దక్కించుకున్నారు. అనంతరం లడ్డూ, కండువా దక్కించుకున్నా వారితో పాటు విగ్రహ దాత ఉప్పర శివశంకర్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు ఉప్పర రాజేష్‌కుమార్, అనిల్ కుమార్ ఘనంగా సన్మానించారు.

ఉత్సవ సమితి యువకులకు సన్మానం

ఉరవకొండ: స్థానిక అయ్యప్పస్వామి ఆలయం వద్ద బాల గణపతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పర్యావరణ రహిత వినాయకుడిని ప్రతిష్ఠించిన యువకులను జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకుడు నాగమల్లి ఓబుళేసు ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఎంపీడీఓ రవిప్రసాద్, ఈఓఆర్‌డీ సతీష్ యువకులను సత్కరించారు. కమిటీ సభ్యులు శీనా, హరి, ఉదయ్, మోహన్, జయ, నరేష్, విరేష్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నిస్వార్థ మహిళా ప్రతినిధి సునీత, కుళ్లాయప్ప, వలి తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ రూరల్: ఈ ఏడాది ఊరూరా ఉత్సాహంగా వినాయక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.. పలుచోట్ల మూడోరోజు శుక్రవారం నిమజ్జనం పూర్తి చేశారు.. మరికొన్నిచోట్ల ఐదోరోజు ఆదివారం నిమజ్జనం చేయనున్నారు. అయితే చవితి ఉత్సవాల్లో ఎక్కడైనా అపశ్రుతి కలగకుండా జాగ్రత్తలు పాటించాలని పోలీసులు తెలియజేస్తున్నారు. అజాగ్రత్తగా ఉంటే అపాయమేనని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచిస్తున్నారు. మండల వ్యాప్తంగా 184 వినాయక విగ్రహాలకు ఉత్సవ నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకున్నారు. ఆదివారం సుమారు 70 నుంచి 80 వినాయక ప్రతిమలు నిమజ్జనానికి తరలివెళ్లనున్నాయి. తొమ్మిదో రోజున కొన్ని నిమజ్జనం చేయనున్నారు. నిమజ్జన వేడుకల్లో జాగ్రత్తలు పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ వ్యవహరించరాదని ఉరవకొండ అర్బన్ సీఐ మహానంది, ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు ఉత్సవ కమిటీ సభ్యులకు సమావేశం నిర్వహించి, ఇప్పటికే సూచనలు చేశారు.


ఉరవకొండలో అయ్యప్పస్వామి ఆలయం వద్ద ముత్యాల వినాయకుడిని ఏర్పాటు చేసిన యువతను సత్కరిస్తున్న దృశ్యం

గణనాథుడికి పూజలు

కూడేరు: మండల వ్యాప్తంగా నాల్గోరోజు శనివారం వినాయక మంటపాల వద్ద కొలువుదీరిన వినాయక ప్రతిమలకు ప్రజలు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. మంటపాల వద్ద అన్నదానం చేశారు.

'చంద్రబాబును నమ్మి మోసపోయాం'


అంబాపురంలో సంక్షేమ పథకాలపై ఆరాతీస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కణేకల్లు: చంద్రబాబును నమ్మి ఓట్లేసి మోసపోయామని మహిళలు, పలువురు బాధితులు వైఎస్సార్‌సీపీ నాయకుల ఎదుట గోడును వెళ్లబోశారు. శనివారం మండలంలోని గెనిగెర, అంబాపురం గ్రామాల్లో 'బాబూ ష్యూరిటీ... మోసం గ్యారెంటీ' కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉషారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, స్థానిక నాయకులు గొని రాజశేఖర్‌రెడ్డి, గోపాల్, అంబాపురం భాస్కర్‌రెడ్డి, తిమ్మారెడ్డి ఆయా కాలనీల్లో పర్యటించి చంద్రబాబు పరిపాలనపై ఆరా తీశారు. బాబును నమ్మి తాము మరోసారి మోసపోయామని మహిళలు చెప్పారు. 16 ఏళ్లున్న మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1,500 ఇస్తామని మాటిచ్చారని, ఏడాదిన్నర పాలన పూర్తయినా అమలు చేయలేదని, 50 ఏళ్లున్న వారికి పింఛన్లు ఇస్తామని..ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని ఆవేదన చెందారు. అర్హులకు పింఛన్లు తొలగించి, వేదన మిగిల్చారని అన్నారు. ఉచిత బస్సు కూడా అంతా తుస్సేనని మండిపడ్డారు. ఈ ఊళ్లకు అత్యంత దగ్గరలో ఉన్న సిటీ బళ్లారి... నిత్యం ఈ రూటులో ప్రయాణిస్తామని, అయితే టికెట్ ఇచ్చి ప్రయాణం చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితి వచ్చిందని మహిళలు వాపోయారు. ఆంధ్ర సరిహద్దు వరకు కూడా ఉచితం ప్రయాణ సౌకర్యం కల్పించే విషయంలో కూటమి సర్కారు విఫలమైందన్నారు. జగనన్న పాలనలో యూరియా కోసం ఏనాడూ ఇబ్బందులు పడలేదని కూటమి ప్రభుత్వ హయాంలో అనేక కష్టాలు పడుతున్నామని రైతులు చెప్పారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, స్థానిక నాయకులు పర్వతరెడ్డి, రవీంద్రారెడ్డి, లేపాక్షిరెడ్డి, జనార్ధన్ రెడ్డి, కిశోర్‌రెడ్డి, శివారెడ్డి, హనుమంతరెడ్డి, అశోక్, వివిధ అనుబంధ సంఘాల నేతలు ఆర్కే బద్రీ, ఆదినద్దురు చంద్రశేఖర్‌రెడ్డి, హళ్లి నాగరాజు, వేమన, పాటిల్ గోవర్ధన్‌రెడ్డి, కెనిగుంట రామిరెడ్డి, వై.హనుమంతు, కోకుర్తి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉనికి కోసం రంగయ్యను విమర్శిస్తారా?


పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: ఉనికి కోసం టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్యను విమర్శించడం సరికాదని వైఎస్‌ఆర్‌సీపీ నేతలు మండిపడ్డారు. శనివారం పట్టణంలోని వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, మండల కన్వీనర్లు గోళ్ల సూరి, సుధీర్, హనుమంతురాయుడు, ఎంఎస్ రాయుడు, కె. హనుమంతరాయడు, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటప్ప విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి ఎమ్మెల్యే సురేంద్రబాబు తాను గెలిస్తే ఏడాదిలోపే జీడిపల్లి నుంచి బైరవాని తిప్ప ప్రాజెక్టుకు సాగునీరు అందిస్తామని చెప్పారన్నారు. అధికారంలోకొచ్చి 15 నెలలు గడిచినా ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. హామీలు నెరవేర్చండి అని సమన్వయ కర్త తలారి రంగయ్య అడిగినందుకు ఏకంగా ఆయన్ను విమర్శించడం సరికాదన్నారు. వినాయక ఉత్సవాలు ఉత్సాహంగా జరుపుకుంటున్నా.. కనీసం పట్టణ సమీపంలోగానీ, మండలంలో ఎక్కడా విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు చుక్కనీరు లేకపోవడం కూటమి పాలనకు అద్దం పడుతోందని విమర్శించారు. నియోజవర్గంలో నీళ్ల లేకపోవడంతో పట్టణానికి 12 కిలో మీటర్ల దూరంలోని ఉరవకొండ నియోజవర్గంలోని బెలుగుప్ప మండలంలోని తండాలో నిమజ్జనం చేయాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. బ్రహ్మసముద్రం ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర నేత రామాంజనేయులు, జిల్లా కోఆర్డినేటర్ ఎర్రంపల్లి కృష్ణమూర్తి, మండల జేసీఎస్ కన్వీనర్ అంజి, మండల ఉపాధ్యక్షుడు మల్లి, బీమప్ప, నాయకులు మల్లి, ప్రతాప్, మోహన్, బిక్కిహరి, మల్లి, మాజీ వాల్మీకి డైరెక్టర్ పాలక్షి, బోరంపల్లి రామిరెడ్డి, షేక్షా, చరణ్, శ్రీకాంత్, మంజు, మారుతి, కోడిపల్లి మంజు, జానీ, కిరీటి యాదవ్ పాల్గొన్నారు.

మోసపూరిత పాలనపై వివరించండి


ప్రజలకు చంద్రబాబు మోసపూరిత పాలనను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: కూటమి మోస పూరిత పాలనపై ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులకు మండల కన్వీనర్ గోళ్ల సూరి తెలియజేశారు. శనివారం మండల పరిధిలో మానిరేవు, కొండాపురం పంచాయతీల్లో వైఎస్‌ఆర్‌సీపీ నూతన కమిటీలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా కోర్డినేటర్ ఎర్రంపల్లి కృష్ణమూర్తి, మండల జేసీఎస్ కన్వీనర్ అంజి, మండల ఉపాధ్యక్షుడు మల్లాపురం మల్లి, మల్లి, ఎంపీటీసీ ఓబులపతి, నాయకులు మోహన్, దొడగట్ట మురళి, బోరంపల్లి రామిరెడ్డి, బసవరాజు, ఆంజనేయులు, మల్లన్న, శ్రీరాం నాయక్, భాస్కర్ రెడ్డి, రామాంజనేయులు, నారాయణస్వామి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసమే అబద్ధపు హామీలు


మాకొడికిలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు, కార్యకర్తలు

శెట్టూరు: చంద్రబాబు అధికారం కోసం అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి విమర్శించారు. శనివారం మండలంలోని మాకొడికి, లక్ష్మంపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి గతంలో జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేసిన విధానం, ప్రస్తుతం చంద్రబాబు ఇచ్చిన హామీలు ప్రజలను మోసగించిన విధానంపై ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎమ్మెస్ రాయుడు, ఎంపీపీ సోమనాథ రెడ్డి, వైస్ ఎంపీపీ ముత్యాలు, సర్పంచులు సత్యనారాయణ రెడ్డి, గొర్ల గంగాధర, విరుపాక్షి, ఎంపీటీసీ సభ్యులు మల్లేష్, మార్టీ అనుబంధ విభాగం నాయకులు శెట్టూరు తిప్పేస్వామి, ప్రతాప్, నాగేంద్ర, చాంద్ బాషా, బాబునాయక్, భీమిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ఖాసీం, ఇమాంవలి, రాము, వెంకట రమణ, బలప్ప, మాజీ సర్పంచ్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా గ్రామ కమిటీల ఎంపిక:

మాకొడికి అధ్యక్షుడు రాజీవ్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్ నాయక్, ప్రధాన కార్యదర్శి మహాదేవ, కార్యదర్శి అంజయ్య, లక్ష్మంపల్లి అధ్యక్షుడు బోయ రవి, కమిటీ సభ్యులు బాలప్ప, ఆంజనేయులు, కాటప్ప, చెర్లోపల్లి అధ్యక్షుడు గొల్ల వీరేష్, కమిటీ సభ్యులు ఓంకార్, నవీన్ కుమార్, నాగభూషణంను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


చాబాలలో మాట్లాడుతున్న తహసీల్దార్ నరేష్‌కుమార్ తదితరులు


తగ్గుపర్తిలో పౌరహక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న అధికారులు

బొమ్మనహాళ్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ మునివేలు, ఎస్‌ఐ నబీరసూల్ సూచించారు. శనివారం మండలంలోని సింగానహళ్లి ఆర్డీటీ కాలనీలో గ్రామస్తులకు పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని చట్టాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఒకరినొకరు కలిసి జీవించాలని, గొడవలు, అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్‌ఐ నవీన్‌కుమార్, వీఆర్వో నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: గ్రామీణ స్థాయిలో ప్రతిపౌరుడికీ చట్టాలపై అవగాహన అవసరమని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కుళ్లాయప్ప తెలిపారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు, కుల వివక్ష, అంటరానితం, ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ప్రతి ఒక్క పౌరుడికీ అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చైతన్య, హాస్టల్‌వార్డెన్ నాగరాజు, సబ్ డివిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ సుమతి అన్నారు. శనివారం మండలంలోని పడమటి కోడిపల్లిలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజ్యాంగంలోని చట్టాలు, పౌరహక్కులపై తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగనాయకులు , సాంఘిక సంక్షేమ హాస్టల్ అధికారి శ్రీనివాసులు, సబ్ డివిజనల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మోహన్, ఆర్‌ఐ నాగిరెడ్డి, వీఆర్వో లక్ష్మన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని తగ్గుపర్తి గ్రామంలో తహసీల్దార్ అనిల్‌కుమార్ అధ్యక్షతన పౌరహక్కుల పరిరక్షణ దినోత్సవం శనివారం నిర్వహించారు. ఎస్‌ఐ శివ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణతో కలసి నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురయితే పోలీసులను ఆశ్రయించాలన్నారు. చట్టాలను దుర్వినియోగం చేయరాదని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దబ్బర మౌనిక, వైస్ ఎంపీపీ పుష్పావతి, మాజీ సహకార సంఘ అధ్యక్షుడు వెంకటనాయుడు, వీఆర్‌ఓ ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి వర్ల శంకర్, ఏపీఓ మురళీకృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు: పౌర హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ నరేష్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని చాబాలలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం సర్పంచు మల్లెల జగదీష్ మాట్లాడుతూ పౌరుల హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వో సురేంద్ర, గ్రామ కార్యదర్శి నాగరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొ న్నారు.


పడమటి కోడిపల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు


మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు, ఎస్‌ఐ నబీరసూల్

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నాయకుడికి నివాళి


బంగి రామాంజనేయులు మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

బొమ్మనహాళ్: గోవిందవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బంగి రామాంజనేయులు (65) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామాంజనేయులు, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు ఎల్. లోకేష్, పయ్యావుల సత్యన్న, పరమేశ్వర, కోటేశ్వరరెడ్డి, డాక్టర్ బసప్ప, కృష్ణ, దేవన్న, తిప్పేస్వామి, సూర్యప్రతాప్‌రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు బంగి రామాంజనేయులు మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం బొల్లనగుడ్డానికి చెందిన బసవరాజు తల్లి దానమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి వెళ్లి నివాళులర్పించారు.

హులికల్లు చిత్తయ్య మృతి

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని హులికల్లుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిత్తయ్య(62) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి శనివారం చిత్తయ్య మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోళ్ల సూరి, జిల్లా కోర్డినేటర్ ఎర్రంపల్లి కృష్ణమూర్తి, మున్సిపాలిటీ అధ్యక్షుడు దొడగట్ట మురళి, వాణిజ్య విభాగం జిల్లా కార్యదర్శి బోరంపల్లి రామిరెడ్డి, బీసీ సెల్ మోహన్, నాయకులు మల్లి, గొల్ల తిమ్మరాజు, చిన్న చిత్తయ్య, సురేష్, తిమ్మారెడ్డి, బొజ్జప్ప తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ టవర్ల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు


మాట్లాడుతున్న తహసీల్దార్ మునివేలు


బొమ్మనహాళ్: సోలార్ విద్యుత్ టవర్ల ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తహసీల్దార్ మునివేలు అన్నారు. శనివారం మండలంలోని శ్రీధరఘట్ట, గోనేహాళ్ గ్రామాల్లో సోలార్ టవర్స్, లైన్ ఏర్పాటుకు భూసేకరణ చేసేందుకు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రైతుల భూముల్లో 7 సెంట్లు నుంచి 10 సెంట్లు భూమిలో టవర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంతో రైతులకు సౌర విద్యుత్ అందుతుందని చెప్పారు. టవర్స్ ఏర్పాటుకు రైతులు సహరించాలని, సౌర విద్యుత్ టవర్స్ ఏర్పాటుతో గ్రామాల్లో ఉన్న భూములకు విలువ పెరుగుతుందన్నారు. గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో సౌర విద్యుత్ అగ్రిజడ్ కంపెనీ మేనేజర్ రాజశేఖర్, వీఆర్వో నరసింహమూర్తి పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక పురోగతి


బ్యాగులను ప్రదర్శిస్తున్న మహిళలు

ఉరవకొండ: స్వయం ఉపాధి కోసం చేతి వృత్తులపై శిక్షణ తీసుకుంటే ఆర్థికంగా పురోగతి సాధించొచ్చని రూట్ సెట్ జిల్లా కోఆర్డినేటర్ సురేష్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కళాశాలలో రూట్ సెట్ ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన సంచులు, హ్యాండ్ బ్యాగ్‌ల తయారీ శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ రూట్ సెట్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో ఎంతో మంది మహిళలు విజయవంతంగా శిక్షణ పూర్తి చేశారన్నారు. అనంతరం శిక్షణలో తయారు చేసిన బ్యాగులు, హ్యాండ్ బ్యాగ్‌లు తదితర వస్తువులను ప్రదర్శించారు. శిక్షకులు తౌడు, సహాయ శిక్షణ అధికారులు సింగాడి దుర్గాప్రసాద్, రేఖ పాల్గొన్నారు.

కొనకొండ్ల విద్యార్థుల ప్రతిభ


హెచ్‌ఎం వేణుగోపాల్, పీడీలు కళా సుధాకర్, లక్ష్మీప్రసాద్ తదితరులను సత్కరిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: క్రీడా పోటీల్లో కొనకొండ్ల జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ సాధించారని, ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, పీడీలు కళాసుధాకర్, లక్ష్మీప్రసాద్ తదితరులు తెలిపారు. శనివారం కొనకొండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారు వివరాలు వెల్లడించారు. శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా స్థాయిలో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పాఠశాలల హెచ్‌ఎంలు, పీడీలను సన్మానించారు. ఇందులో కొనకొండ్ల పాఠశాల ద్వితీయ స్థానంలో నిలవడంతో డీఈఓ ప్రసాద్‌బాబు, ఎస్‌టీఎఫ్ సెక్రటరీ సుగుణమ్మ తదితరులు కొనకొండ్ల హెచ్‌ఎం వేణుగోపాల్, పీడీలు కళాసుధాకర్, లక్ష్మీప్రసాద్‌ను సత్కరించి అభినందించారు.

భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ


స్వామి వారి పల్లకీ ఊరేగింపు

ఉరవకొండ రూరల్: స్థానిక పెన్నహోబిలం నృసింహస్వామి సన్నిధిలో శనివారం పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవ మూర్తులను అందంగా అలంకరించిన పల్లకీలో ఉంచి ఆలయం చుట్టూ డప్పు వాయిద్యాలు, మేలతాళాల నడుమ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమేష్‌బాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి


మాట్లాడుతున్న ఎంఈఓ-2 సాయికృష్ణ

కూడేరు: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఎంఈఓ-2 సాయికృష్ణ తెలిపారు. శనివారం కూడేరులోని హైస్కూల్‌లో క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 సాయికృష్ణ మాట్లాడారు. మారిన విద్యా విధానాలపై అవగాహన పెంచుకొని పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని, ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దే విధంగా విద్యా బోధన ఉండాలని సూచించారు.

బీవీఎం క్రికెట్ టోర్నీ విజేత చిక్కప్ప పాఠశాల జట్టు


విన్నర్స్‌తో పాఠశాల ఉపాధ్యాయులు

కళ్యాణదుర్గం : బీవీఎం క్రికెట్ పోటీల్లో కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల జట్టు విజయం సాధించింది. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన బీవీఎం క్రికెట్ పోటీల్లో దాదాపు 18 టీంలు పాల్గొన్నాయి. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జ్ఞాన భారతి - కరణం చిక్కప్ప పాఠశాలల జట్ల మధ్య పోటీ నెలకొంది. దీంతో జ్ఞాన భారతి ప్రైవేట్ ఉన్నత పాఠశాల జట్టుపై కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాల జట్టు విజయం సాధించింది. దీంతో విన్నర్స్ జట్టుకు రూ. 20 వేల బహుమతి అందించారు. కేసీజీ హెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీగంధం శ్రీనివాసులు, ఉపాధ్యాయుల బృందం విజేత జట్టును అభినందించారు.

బాల్య వివాహాలు అరికట్టాలి


మాట్లాడుతున్న జడ్జి భాను

కళ్యాణదుర్గం రూరల్: బాల్య వివాహాలను అరికట్టాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ , జూనియర్ సివిల్ జడ్జి భాను తెలిపారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని అంగన్‌వాడీ సిబ్బందికి బాల్య వివాహాలు, చిన్న వయసులో పెళ్లి చేసుకోవడం వల్ల జరిగే అనర్థాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిని నియంత్రించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ సిబ్బంది ప్రజలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వంశీ, న్యాయవాదులు పార్థసారథి, రామాంజనేయులు, దాదాఖలందర్, ఎస్‌ఐ చైతన్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లులో ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకుడు అనిల్‌కుమార్ చార్యులు ఆధ్వర్యంలో అంజన్నకు పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు అన్నదాన కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

యువతి అదృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్‌లో యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నబీరసూల్ శనివారం తెలిపారు. యువతి పొలం వద్దకు వెళ్తానని చెప్పి ఈనెల 29న సాయంత్రం వెళ్లి తిరిగి రాలేదని, ఆమె ఆచూకీ కోసం పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ తెలిపారు. వివరాలు తెలిస్తే బొమ్మనహాళ్ సెల్: 9346010584లో సమాచారం అందించాలని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బెళుగుప్ప: బ్రాహ్మణపల్లి వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వడ్డే రాము (36) అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. వివరాలు.. కణేకల్ మండలం ఎర్రగుంటకు చెందినరాము శెట్టూరు మండలం ఐదుకల్లుకు ద్విచక్రవాహనంపై వెళ్తూ బ్రాహ్మణపల్లి వద్ద డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. మృతుడికి భార్య మహాలక్ష్మి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

శానిటేషన్‌పై ప్రొజెక్టర్‌తో అవగాహన


తగ్గుపర్తిలో శానిటేషన్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బెళుగుప్ప: తగ్గుపర్తిలోని ఆర్‌ఎస్‌కే కేంద్రంలో సర్పంచ్ దబ్బర మౌనిక అధ్యక్షతన శానిటేషన్‌పై ప్రొజెక్టర్‌తో తహసీల్దార్ అనిల్ కుమార్, అధికారులు శనివారం అవగాహన కల్పించారు. సహన స్వచ్ఛం సంస్థ సుజలాన్ ఫౌండేషన్ కంపెనీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఏపీఓ మురళీకృష్ణ, మాజీ సహకార సంఘ అధ్యక్షుడు వెంకటనాయుడు, వైస్ ఎంపీపీ పుష్పావతి, సహన సిబ్బంది నరేష్, గురు, ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి వర్ల శంకర్, స్వయం సహాయక సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలి

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని చిన్నహోతూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర మాకానాం ఏక్ పేడ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కోఆర్డినేటర్ తాటికొండ శ్రీవెంకట్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటితో అవస్థలు

వజ్రకరూరు: స్థానిక మెయిన్ బజార్ సమీపంలో 8వ వార్డులో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వార్డులో వర్షపునీరు నిలిచి, ముందుకు వెళ్లడంలేదు. స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిల్వ ఉంటోంది. అపరిశుభ్రతతోపాటు దుర్వాసన వస్తోందని, దోమల బెడద అధికమైందని స్థానికులు అంటున్నారు. సమస్యను పరిష్కరించాలని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వార్డు సభ్యుడు మల్లికార్జునరెడ్డి తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ముళ్ల పొదల తొలగింపు



మాస్టర్ సీవీవీ నగర్, చౌడేశ్వరి కాలనీల్లో ముళ్ల కంపలు శుభ్రం చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

ఉరవకొండ: పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో ముళ్ల పొదలను తొలగింపజేశారు. 'అపరిశుభ్రత నడుమ అంగన్‌వాడీ కేంద్రాలు' శీర్షికన ఈనెల 30న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. మేజర్ పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్ స్పందించారు. శనివారం ఆయా అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. స్థానిక మాస్టర్ సీవీవీ నగర్, చౌడేశ్వరీ కాలనీలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద చెత్తాచెదారం చేరి ముళ్ల కంపలు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తుండటంతో కేంద్రానికి వచ్చే గర్భిణులు, చిన్నారులు ఇబ్బందిపడేవారు. దీనిపై స్పందించిన ఈఓ పారిశుద్ధ్య సిబ్బంది చేత శుభ్రం చేయించారు.